

# ఉమ్మడి మెదక్ జిల్లాపై నరేందర్ రెడ్డి శీతకన్ను!

- సొంత పార్టీ నేతలను నమ్మని వైనం
- సొంతంగా సిబ్బందితో ఎన్నికల వ్యవహారం
- బహిరంగంగానే ఆరోపిస్తున్ననేతలు
- అంతర్గతంగా మథనపడుతున్న కాంగ్రెస్ నాయకులు
- పార్టీ లీడర్లపై సొంత సిబ్బంది పెత్తనం
- అసహనానికి గురవుతున్న నాయకులు
- కాంగ్రెస్ పార్టీ నేతలను గుర్తించడం లేదనే ప్రచారం
- అయోమయంలో కార్యకర్తలు

**(ప్రత్యేక ప్రతినిధి-సిరిన్యూస్) :** మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలు ఉత్కంఠను రేపుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు హోరాహోరీగా తమ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో పట్టభద్రుల నియోజకవర్గాన్ని సుడిగాలిలా చుడుతున్నారు. అయితే అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధిపతి నరేందర్‌రెడ్డి గెలుపు కోసం ఉమ్మడి మెదక్ జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తుంటే ఆయన మాత్రం ఉమ్మడి జిల్లాపై శీతకన్ను పెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఓవైపు కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం పాటుపడుతుంటే ఇక్కడి నేతలు, కార్యకర్తలను అసలు పట్టించుకోవడం లేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో నరేందర్‌రెడ్డి పర్యటించిన దాఖలాలు లేవని పలువురు పట్టభద్రులు అంటున్నారు. అసలు ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నాయకులను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మరోవైపు నరేందర్‌రెడ్డిపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు సైతం వెల్లువెత్తడం చర్చనీయాంశంగా మారుతుంది.

### సొంత పార్టీ నేతలనే నమ్మడం లేదా ?

కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డిపై సొంత పార్టీలోనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓవైపు పోలింగ్ తేదీ దగ్గర పడుతుంటే మరోవైపు పార్టీతో పాటు ప్రజల్లో సైతం పరిస్థితులు మారుతున్నట్లు తెలుస్తోంది. ప్రచారంలో భాగంగా ఏ జిల్లాకు వెళ్ళినా అక్కడి కాంగ్రెస్ నేతలకు ప్రియారిటీ ఇవ్వకుండా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పార్టీ నేతలకు అభ్యర్థిపై అంతర్మథనం మొదలైనట్లు చెబుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పార్టీ పరువు పోతుందని భావించి ఇక్కడి జిల్లా నేతలు సమావేశాలు ఏర్పాటు చేసి అభ్యర్థి గెలుపుకు సహకరించాలని కోరుతున్నారు తప్పా..తమకు గుర్తింపు లభించడం లేదనే భావన మాత్రం మెండుగానే ఉంది. అంతేగాకుండా ఇప్పటి వరకు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సైతం పూర్తిస్థాయిలో మద్దతు ఇవ్వడం లేదనే వాదన వినిపిస్తోంది. ప్రచారంలో భాగంగా నరేందర్‌రెడ్డి తన సొంత సిబ్బందికే పెత్తనం అప్పగించడంతో కాంగ్రెస్ నేతలు నిమ్మకుండిపోతున్నారు. తమకు విలువనివ్వడం లేదని, తమను గుర్తించనప్పుడు తాము చేసేదేమీ లేదని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. మరోవైపు ప్రత్యర్థి అభ్యర్థి ఉమ్మడి జిల్లాలో దూసుకుపోతుంటే కాంగ్రెస్ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డి ఒంటెద్దు పోకడలతో సొంత పార్టీ నుంచే తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారనే ప్రచారం సాగుతోంది. ఎన్నికల సమయం దగ్గర పడుతుండగా ఇలాంటి పరిస్థితి ఎదురవడంతో నరేందర్‌రెడ్డి సరిదిద్దుకుంటారా లేక తన సొంత సిబ్బందితోనే ప్రచారం చేయించుకుంటారా అనేది వేచిచూడాల్సిందే. ఏదిఏమైనా నరేందర్‌రెడ్డి వ్యవ హారంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో మాత్రం కాంగ్రెస్ పార్టీ నేతల్లో మాత్రం నిర్లిప్తత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

# మెనూ పాటించాలి

- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి
- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- సమస్యలు ఉంటే మా దృష్టికి తేవాలి
- పరిష్కారానికి కృషి చేస్తాం
- సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి



**సిద్దిపేట 19 ఫిబ్రవరి (సిరి న్యూస్)** గురుకుల విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అన్నారు. విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అందించాలని సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ నారాయణరావుపేట మండలంలోని గుర్రాలగొంది గ్రామంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయాన్ని సందర్శించి గురుకులంలోని డార్మెటరీ, స్టోర్ రూమ్, కిచెన్ హాల్ లను పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా త్రాగునీరుకు ఆర్వో ప్లాంట్ కావాలని ఉపాధ్యాయులు అడిగారు. అనంతరం సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎదురుగా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సమీకృత వసతి గృహాల సముదాయ భవనం పరిశీలించి ఈ హాస్టల్లో 235 మంది ఎస్సీ, ఎస్టీ మరియు బిసి విద్యార్థులకు కల్పిస్తున్న ఆవాస మరియు భోజన సౌకర్యాలను పరిశీలించారు. కిచెన్ రూమ్ లో పరిశుభ్రతను, స్టోర్ రూమ్ లో వంట సామాగ్రిని పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం అందించాలని, హాస్టల్ కు అవసరమైన సంపు నిర్మాణానికి ఈడబ్ల్యుఐడీసీ అధికారులచే ఎస్టిమేషన్ చేసి పంపించాలని, హాస్టల్లో ఇతర ఏ సమస్యలో ఉన్న ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని వసతి గృహ సంక్షేమ అధికారులు మల్లేష్ మరియు సత్య నారాయణ ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట ఇంచార్జి జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి ఎండి. హమీద్ ఉన్నారు.

# తూకంలో మోసం !

- వినియోగదారులకు నష్టం
- అధికారుల నామ మాత్రపు తనిఖీలు



**సిరి న్యూస్, గుమ్మడిదల :** వినియోగదారున్ని తూకాలలో మోసం చేస్తున్నారని, అధికారుల నామమాత్రపు తనిఖీలతో వినియోగదారులు తీవ్ర నష్టాల గురవుతున్నారు. వినియోగదారులు కిలో అనుకొని కొనుగోలు చేస్తే వారికి 100 నుంచి 200 గ్రాముల తూకాల్లో తక్కువ వస్తుందని గుమ్మడిదల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి గురువారం మండల కేంద్రమైన గుమ్మడిదలలో జరిగే సంతలో తూకాలలో వినియోగదారులకు మోసం చేస్తున్నారు. కూరగాయలను అమ్మడానికి వచ్చిన వ్యాపారులు రబ్బర్ బ్యాండ్ లు కట్టి కాటా లు మోసం చేస్తూ నట్లు వినియోగదారులు వాపోతున్నారు. తూకాలలో అరిగిపోయిన రాళ్ళను వినియోగించడం డిజిటల్ ట్రూకాలర్ యంత్రాలలో తప్పుడుగా నమోదు చేయడం నికర బరువు కన్నా తక్కువ ఉండేలా ప్యాకింగ్ చేయడం వంటి మోసాలకు పాల్పడుతున్నారు. ధరలు పెంచి విక్రయించడం తూకం తక్కువగా ఉండడం సరుకు పరిమాణంలో తగ్గుదల ఇలా వివిధ రకాల వినియోగదారులు నష్టపోతున్నారు. తూనికల శాఖ అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు మాత్రం లేవు . మోసం జరిగిన పరిస్థితుల్లో ఎవరికి ఎక్కడ ఫిర్యాదు చేయాలో కొనుగోలుదారుల్లో చాలామందికి అవగాహన ఉండటం లేదు ఇప్పటికైనా తూనికలు కొలతలు అధికారులు తనిఖీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.